
సాక్షి
చిత్తూరు
సోమవారం ၊ 1 ၊ జూలై ၊ 2024



తెప్పపై శ్రీమన్నారాయణుడి వైభవం

టి.పుత్తూరు గ్రామంలో కోదండరాముడి తెప్పోత్సవాన్ని ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. - 8లో



త్వరలో 'గంగమ్మ శిరస్సు' సాకారం

గంగమ్మ శిరస్సు ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని నీటిపారుదలశాఖ సాంకేతిక పర్యవేక్షకులు తెలిపారు. - 8లో

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. తొలిరోజే పింఛన్ల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. - 8లో

న్యూస్‌రీల్

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

చిత్తూరు అర్బన్: గంజాయి విక్రయాలపై పోలీసుశాఖ ఉక్కుపాదం మోపడానికి సిద్ధమవుతున్నట్లు చిత్తూరు ఎస్పీ మణికంఠ స్పష్టం చేశారు. ఇందుకోసం వంద రోజుల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. ఆదివారం ఆయన చిత్తూరులో మీడియాతో మాట్లాడుతూ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులను కలుపుకుని పోలీసులు గంజాయి అరికట్టడంపై ఓ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ఇది ఎక్కడి నుంచి దిగుమతి అవుతోందో తెలుసుకోవడానికి ఆర్టీసీ బస్సులు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, పార్శిల్ సర్వీసులపై నిఘా పెట్టామన్నారు. ఇక రాత్రులు ప్రత్యేక గస్తీ వల్ల నేరాల నియంత్రణకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇప్పటి వరకు రూ.35 లక్షల వరకు న్యాయస్థానాలు జరిమానాలు విధించిందన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తున్న వాళ్లపై త్వరలోనే కేసులను నమోదు చేస్తామన్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చే ప్రక్రియ పూర్తి కావొచ్చిందని, ఇక నుంచి మైనర్లకు వాహనాలిచ్చిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. చిత్తూరు నగరంలో ఎక్కడైనా ర్యాష్ డ్రైవింగ్, బైకులపై ముగ్గురు వెళ్తే ఫొటోలు, వీడియోలను 9491074571 నంబరుకు పంపాలని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

కాణిపాకం కిటకిట

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అభిషేక పూజల అనంతరం భక్తులు స్వామి దర్శనం కోసం క్యూకట్టారు. క్యూలైన్లు అన్నీ నిండుకున్నాయి. దీంతో స్వామి సర్వదర్శనానికి 2 గంటల సమయం పట్టింది. రాత్రి వరకు కూడా రద్దీ ఇలానే కొనసాగింది. ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ..భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూశారు.

నేడు పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాసమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో సోమవారం నుంచి రేషన్ పంపిణీ జరగనున్నట్లు డీఎస్ఓ శంకరన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెలకు సంబంధించి ప్రభుత్వం1339 చౌకదుకాణాల పరిధిలోని 5,31,019 కార్డులకు గానూ 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేశామన్నారు. రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని, కార్డుదారులు నిర్ణీత సమయంలోపు సరుకులు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ప్రతి బుధవారం ఫిర్యాదుల స్వీకరణ

– ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు



సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఇక ప్రతి బుధవారం ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ కేంద్రాల్లో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆదివారం చిత్తూరులోని ఆ శాఖ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని జూలై 3న బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రతి బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వినియోగదారుల సమస్యల నమోదు, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. స్థానికంగా సమస్యలను తెలుసుకోవడానికి విద్యుత్ లైన్లను తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 430 సబ్‌స్టేషన్ల పరిధిలో 1650 ఫీడర్ల లైన్లను పరిశీలించి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్యల కారణంగా ఎక్కడా పంటలు ఎండకుండా చూస్తామని, సాగుకు నిరంతరాయంగా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. లోఓల్టేజీ ప్రాంతాల్లో కొత్తగా సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.





జర్మన్ పెప్పర్ ఎలక్ట్రికల్ మోషన్ బస్సు

పరిశ్రమలు పరార్!

'కరువుకు మారుపేరైన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాలను సస్యశ్యామలం చేయాలి. డొక్కలు మాడ్చుకుని ఊరుగాని ఊరు వెళుతున్న నిరుపేదల వలసలను నివారించాలి. స్థానికంగానే ఉపాధి కల్పించి చేయూతనందించాలి..' అనే సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పుంగనూరు వేదికగా పరిశ్రమల కారిడార్ తీసుకువచ్చింది. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తికి చెందిన ఫెరా ఆలాయ్, గ్రానైట్, ఫీడ్ పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందించింది. అలాగే ప్రతిష్టాత్మకమైన జర్మన్ పెప్పర్ ఎలక్ట్రికల్ మోషన్ బస్సులు, ట్రక్కుల పరిశ్రమను నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ వ్యవహారశైలితో ఆయా కంపెనీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. టీడీపీ నేతల దమనకాండతో ఆయా పరిశ్రమల స్థాపన సందిగ్ధంలో పడింది. వేలాది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువత భవితకు ఆశనిపాతమైంది.

ఆగడాలే కారణం

కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు సరిహద్దు ప్రాంతంగా ఉన్న పుంగనూరులో పుష్కలమైన వనరులు లభిస్తాయని జర్మన్ కంపెనీ భావించింది. అందులో భాగంగానే ఇక్కడ బస్సుల కంపెనీని ఏర్పాటుచేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టారు. ఇలాంటి తరుణంలో టీడీపీ అధికారం చేపట్టింది. పరిశ్రమ స్థాపనపై నీలినీడలు కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం అండతో ఆ పార్టీ శ్రేణులు అల్లర్లు సృష్టిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్నడూ లేనివిధంగా స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నియోజకవర్గంలో తిరగరాదంటూ కూటమి శ్రేణులు అడ్డుకోవడంతో ఒక్కసారిగా పుంగనూరు ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. టీడీపీ నేతల ఆగడాలకు ప్రశాంత వాతావరణం దెబ్బతింటోంది. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు, ఆస్తుల ధ్వంసం లాంటి ఘటనలతో బస్సుల కంపెనీ ఏర్పాటుకు యాజమాన్యం వెనకడుగు వేస్తోంది.

పుంగనూరులో పరిశ్రమల కారిడార్ కనుమరుగు?

- సందిగ్ధంలో జర్మన్ బస్సుల తయారీ ఫ్యాక్టరీ
- టీడీపీ నేతల ఆగడాలే కారణం
- పునరాలోచనలో పడిన పరిశ్రమల యాజమాన్యం
- ప్రశ్నార్థకంగా గ్రానైట్, ఫీడ్ కంపెనీలు
- దెబ్బతింటున్న ప్రశాంత వాతావరణం
- అప్రతిష్ట మూటగట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం

పుంగనూరు: స్థానికంగా పదివేల మంది నిరుద్యోగులకు ప్రత్యక్ష ఉపాధి, మరో 20 వేల మందికి పరోక్ష ఉపాధి కల్పించే జర్మన్ పెప్పర్ ఎలక్ట్రికల్ మోషన్ బస్సులు, ట్రక్కుల పరిశ్రమ పుంగనూరు ప్రాంతం నుంచి తరలిపోనుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తూరు జిల్లా, పడమటి ప్రాంతంలో నిరుద్యోగం, వలసల నివారణకు పుంగనూరు సమీపంలోని ఆరడిగుంటలో రూ.4.640 కోట్లతో 800 ఎకరాలలో బస్సుల పరిశ్రమ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ మేరకు గత ఏడాది అనుమతులు కూడా మంజూరు చేసింది. అప్పటి మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, కంపెనీ సీఈఓ ఆండ్రియస్ హేగర్‌తో గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన పనులు ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు భూసేకరణ కూడా పూర్తిచేశారు. ఈ పరిశ్రమ పశ్చిమ ప్రాంతంలో మొట్టమొదట అతి పెద్ద భారీ పరిశ్రమగా నిలవనుందని స్థానికులు కలలుగన్నారు. ఈ ప్రాంతవాసులు తమ బతుకులు మారుతాయని, బిడ్డల భవిష్యత్ బాగుంటుందని సంబరపడ్డారు. అయితే ఈ సంతోషం కొన్నాళ్లు కూడా నిలవలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిశ్రమ ఏర్పాటు ఆశలపై నీరుచల్లినట్టయ్యింది. ప్రశాంతతకు మారుపేరైన పుంగనూరులో టీడీపీ శ్రేణులు సృష్టిస్తున్న అలజడులు, అల్లర్లు శాంతి భద్రతల సమస్యకు దారితీస్తున్నాయి. ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితుల్లో భారీ పరిశ్రమ నెలకొల్పేందుకు యాజమాన్యం పునరాలోచనలో పడింది.

నాటి నుంచి అడ్డంకులే

పుంగనూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి కక్షగట్టారు. ఈ విభేదాలతోనే ఇన్నేళ్లుగా వారు అధికారంలో ఉన్నప్పుడు పుంగనూరు అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ఐదేళ్లుగా పుంగనూరులో ఊహించని అభివృద్ధి జరిగింది. ఇలాంటి తరుణంలో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిపోయింది.

గతంలో ఎప్పుడూ అల్లర్లు లేవు

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2004లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండు సార్లు మంత్రిగా పనిచేశారు. నాటి నుంచి పుంగనూరులో అల్లర్లు జరగలేదు. శాంతి భద్రతలకు విఘాతం కలగలేదు. ఇలాంటి ప్రశాంతత కలిగిన పుంగనూరులో ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేసే ఆగడాలకు జనం బెంబేలెత్తిపోతున్నారు.



పుంగనూరులో కంపెనీ సీఈఓ ఆండ్రియస్ హేగర్, ప్రతినిధులు, కలెక్టర్ షణ్మోహన్‌ను సన్మానిస్తున్న స్థానిక నేతలు (ఫైల్)

కంపెనీలు వెనక్కే!

పుంగనూరు మండలంలో సుమారు 20 వేల ఎకరాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిశ్రమల కారిడార్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ శ్రీకాళహస్తికి చెందిన ఫెరా ఆలాయ్ పరిశ్రమ పనులు జరుగుతున్నాయి. అలాగే జర్మన్ కంపెనీ పనులు చేపట్టింది. గ్రానైట్ పరిశ్రమ, ఫీడ్ పరిశ్రమతో పాటు మరిన్ని కంపెనీలు ఏర్పాటుకు ముందుకొచ్చాయి. ఒక్కసారిగా అధికార పార్టీ చేష్టలకు పరిశ్రమల యాజమాన్యాలు హడలిపోతున్నాయి. ప్రశాంతత లేని ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటు కష్టతరమేనని భావించి మరొక ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద భూములను పరిశీలిస్తున్న కంపెనీ సీఈఓ ఆండ్రియస్ హేగర్ తదితరులు (ఫైల్)

హైవేలో రెండు ఏనుగుల పాట్లు

- రోడ్డు దాటేందుకు రెండు గంటలుగా ఏనుగుల ఎదురు చూపులు
- గజరాజులను చూసి వాహనదారుల భయాందోళన

పలమనేరు: పలమనేరు పట్టణ సమీపంలోని చెన్నై–బెంగళూరు హైవేలో గాంధీనగర్ వద్ద కౌండిన్య అడవిలో నుంచి వచ్చిన రెండు మదపు టేనుగులు హైవే దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఏనుగులను చూసి ఆ మార్గంలో ప్రయాణించే స్కూటరిస్టులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. గత కొంతకాలంగా కౌండిన్య అభయారణ్యంలోని ఏనుగులు మొగిలి ఘాట్‌లో హైవేని దాటి ఆ పక్కనే ఉన్న గాంధీనగర్, జగమర్ల అడవిలోకి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో రెండు ఏనుగులు హైవేని దాటేందుకు రెండు గంటల పాటు తీవ్రంగా ప్రయత్నించాయి. అయితే హైవేలో వేగంగా వస్తోన్న వాహనాలను చూసి రోడ్డు దాటలేక అలానే నిలబడిపోయాయి. ఏనుగులను చూసిన వాహనచోదకులు భయపడ్డారు. అంతసేపు ఏనుగులు హైవే పక్కన ఉన్నా.. స్థానిక అటవీశాఖ అధికారులు గానీ ఎలిఫెంట్ ట్రాకర్లు గానీ అటువైపు రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఉన్న ఎఫ్ఆర్వోలు ఏనుగుల విషయంలో తీసుకున్న ముందు జాగ్రత్తలను ఇప్పుడున్న అధికారులు పట్టించుకోవడం లేదనే మాట వినిపిస్తోంది.

కలెక్టరేట్ ఏఓగా పార్థసారథి

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్ ఏఓ (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్)గా పార్థసారథిని నియమించారు. ప్రస్తుతం ఏఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరన్ జూన్ 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో కలెక్టరేట్‌లోని ఈ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథికి ఏఓగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. సార్వత్రిక ఎన్నికల విధులకు ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు జిల్లాకు విచ్చేశాక రెగ్యులర్ ఏఓను నియమించనున్నారు. అప్పటి వరకు ఏఓగా పార్థసారథి కొనసాగనున్నారు.

బియ్యం మాత్రమే పంపిణీ..!

- రేషన్ సరుకుల్లో చక్కెర, కందిపప్పు, రాగులు, పిండికి కోతలు

కాణిపాకం: ప్రజాపంపిణీలో సోమవారం నుంచి పంపిణీ చేసే సరుకుల్లో బియ్యం మాత్రమే కార్డుదారులకు అందనుంది. చక్కెర, కందిపప్పు, రాగులు, రాగిపిండికి కోతలు పెట్టారు. సాకులు చూపి సరుకులకు కోతలు పెట్టారని తెల్లకార్డుదారులు తెల్లబోతున్నారు. జిల్లాలో 1339 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. ఈ షాపుల పరిధిలో 5,31,019 కార్డుదారులు ఉన్నారు. గతంలో ఈ కార్డుదారులకు గానూ బియ్యం 15 వేల మెట్రిక్ టన్నులు, చక్కెర 270 టన్నులు, కందిపప్పు 534 టన్నులు, రాగులు 500 టన్నులు, పిండి 300 టన్నుల వరకు సరఫరా చేసేది. అయితే ఈ నెల ప్రజాపంపిణీని బియ్యానికే పరిమితం చేసింది. చక్కెర, కందిపప్పుకు బ్రేకులు వేసింది. దీంతో ఈనెల రేషన్ సరుకుల్లో కందిపప్పు, చక్కెరతో పాటు రాగులు, రాగిపిండి కూడా లేదు.

పెరిగిన నిత్యావసర సరుకులు..

మార్కెట్లో నిత్యావసరుకులు ఆకాశన్నంటుతున్నాయి. సామాన్య జనం సరుకుల రేట్లను చూసి బెంబేలెత్తిపోతున్నారు. కూరగాయలతో పాటు పప్పు దినుసుల రేట్లు కూడా అమాంతంగా పెరిగాయి. ప్రధానంగా కందిపప్పు రూ.120లకు పైనే ధర పలుకుతోంది. ఇలాంటి తరుణంలో రేషన్‌లో కంది పప్పు పంపిణీ చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

అయ్యో..తల్లీ!

భర్త అడిగిన మాటలతో విసిగిపోయింది. తన తల్లిదండ్రులపై కోప్పడ్డ తీరు కుంగదీసేలా చేసింది. దీనికితోడు పుట్టింట్లో రెండు రోజుల పాటు జరిగే జాతరకు కూడా వెళ్లొద్దంటూ హుకుం జారీ చేయడం మనసును కకావికలం చేసింది. ఎలాగోలా ఇద్దరు ఆడ బిడ్డలను తీసుకుని పొద్దుపోయాక పుట్టింటికి చేరింది. రాత్రంతా భర్త అడిగిన మాటలు తలుచుకుని కన్నీళ్లు పెట్టుకుంది. పొద్దున్నే బిడ్డలిద్దర్నీ నిద్రలేపి మసకమసక చీకట్లో గ్రామ సమీపంలోని బావి వద్దకు చేరింది. ముందుగా తన ఇద్దరి బిడ్డలను బావిలో తోసి.. తర్వాత తనూ దూకి తనువు చాలించింది. ఈ ఘటన ఆదివారం పుంగనూరు నియోజకవర్గం, సోమల మండలంలో విషాదాన్ని నింపింది.

- బావిలో దూకి తల్లీకూతుళ్ల ఆత్మహత్య
- జాతరకని వచ్చి అనంతలోకాలకు
- భర్త వేధింపులే కారణమా?
- శోకసంద్రంలో రాయలపేట



మృత దేహాల వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గం, సోమల మండలం, పట్రపల్లెలో ఆదివారం పెను విషాదం చోటుచేసుకుంది. మెట్టినింటి నుంచి జాతరకని పుట్టింటికొచ్చిన ఓ వివాహిత తన ఇద్దరు ఆడబిడ్డలను బావిలో తోసి తనూ దూకి తనువు చాలించడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. స్థానికులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం.. మండలంలోని పట్రపల్లె గ్రామానికి చెందిన వెంకట్రామయ్య, కృష్ణమ్మ దంపతుల కుమార్తె కె.రాణి (30)కి పెద్దపంజాణి మండలం, రాయలపేటకు చెందిన దిలీప్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి జ్యోతి (8), హిమశ్రీ (6) ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తరచూ భార్యాభర్తలు గొడవపడేవారు. దిలీప్ తల్లిదండ్రులు కూడా రాణిని మానసికంగా వేధించేవారు.

ముగ్గుర్ని బలితీసుకున్న జాతర చిచ్చు

గత వారం రాయలపేటలో జాతర నిర్వహించారు. ఆ జాతరకు రావాలని రాణి తల్లిదండ్రులకు అల్లుడు దిలీప్ కబురు పంపాడు. కానీ పనుల ఒత్తిడితో వారు రాలేకపోయారు. ఇదిలావుండగా శని, ఆదివారాల్లో రాణి సొంతూరు పట్రపల్లెలో ఆవుల పల్లె జాతర జరిగింది. ఈ జాతరకు రాణి తల్లిదండ్రులు అల్లుడు దిలీప్‌కు కబురు పంపారు. కానీ అతను రాకపోగా.. భార్య రాణిని కూడా వెళ్లొద్దంటూ గొడవపడ్డాడు. ఆపై కోపోద్రిక్తుడైన దిలీప్ భార్య చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను నేలకేసి కొట్టాడు. దీంతో రాణి మానసికంగా కుంగిపోయింది. శని



తల్లీ కూతుళ్ల మృతదేహాలు

వారం సాయంత్రం పొద్దుపోయాక రాయలపేట నుంచి పుట్టింటికి చేరింది. రాత్రంతా భర్త అడిగిన మాటలు తలుచుకుని కన్నీటిపర్యంతమైంది. ఇక భర్తతో ఇమడలేనని నిశ్చయించుకుంది. తను దూరమైతే బిడ్డలు అనాథలైపోతారని.. వారిని కూడా తీసుకెళ్లాలని భావించింది. ఆదివారం ఉదయాన్నే ఇద్దరు బిడ్డలను తీసుకుని గ్రామ సమీపంలోని బావిలో తోసి తనూ దూకి తనువు చాలించింది. రాణి, పిల్లలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. బావిలో మృతదేహాలను పశువుల కాపర్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. తర్వాత బావిలో నుంచి మృతదేహాలను బయటకు తీసి బోరున విలపించారు.

శోకసంద్రంలో రాయలపేట

పెద్దపంజాణి: తల్లి, కుమార్తెల మృతితో మండలంలోని రాయలపేట శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన పటాలమ్మగుడి పూజారి ఆంజప్ప పెద్ద కుమారుడు దిలీప్ కార్పెంటర్. సోమల మండలం, పట్రపల్లికి చెందిన రాణితో పదేళ్ల క్రితం పెద్దలు నిశ్చయించి పెళ్లి చేశారు. శనివారం పుట్టింట్లో జరిగే గంగజాతరకు వెళ్లిన రాణి, ఇద్దరు కుమార్తెలు శవాలై తిరిగి రావడంతో గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు చూపరులను కలచివేసింది. అందరితో కలివిడిగా మాట్లాడే రాణి విగత జీవిగా చేరుకోవడంతో బంధువులు గుండెలవిసేలా రోధించారు. అనంతరం అశ్రునయనాల మధ్య తల్లి బిడ్డల అంత్యక్రియలు పూర్తిచేశారు.

వేధింపులే కారణమా?

రాణి మృతికి భర్త, అతని కుటుంబ సభ్యుల వేధింపులే కారణమని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరచూ తమ కుమార్తెను చులకనగా మాట్లాడుతూ మానసికంగా కుంగదీశారని పేర్కొన్నారు. వారి వేధింపుల వల్లే తమ కుమార్తె చనిపోయిందని ఆరోపించారు.

హౌస్ అరెస్ట్ అప్రజాస్వామికం



విలేకరులతో మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గ పర్యటనకు బయలుదేరిన మిథున్‌రెడ్డిని తిరుపతిలోని ఆయన ఇంటి వద్దే పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టు నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజల బాగోగులు చూసేందుకు బయలుదేరిన ఎంపీ అడ్డుకోవడమేంటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తూ పుంగనూరులో ఇష్టారాజ్యంగా విధ్వంసాలకు పాల్పడుతున్న టీడీపీ నేతల దుశ్చర్యలను ఖండించడమే కాకుండా, పార్టీ శ్రేణులను ఓదార్చేందుకు వెళుతున్న ఎంపీని హౌస్ అరెస్ట్ చేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ప్రజాప్రతినిధులను నియోజకవర్గ పర్యటనకు వెళ్లనివ్వకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఇలాంటి సంస్కృతి మంచిది కాదని, దీనిపై ముఖ్యమంత్రి పునరాలోచన చేయాలన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను, పార్టీ జెండా దిమ్మెలను, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయడం వంటి విపరీత ధోరణులకు స్వస్తి పలకాలని సూచించారు.

- కూటమి నేతల పోటాపోటీ
- ఈసారి చిత్తూరు వారికి కేటాయించే అవకాశం
- తాము చేతగాని వారమా? అంటున్న తిరుపతి నేతలు

తుడాపైనే కన్ను



సాక్షి, తిరుపతి: తుడా చైర్మన్ పదవి కోసం కూటమి నేతలు పోటీపడుతున్నారు. తిరుపతి నుంచి పది మంది, శ్రీకాళహస్తి, చిత్తూరు నుంచి ఇద్దరు ఎవరి స్థాయిలో వారు పైరవీలు నెరుపుతున్నారు. ఇదిలా ఉంటే.. టీటీడీ మాజీ చైర్మన్ ఆదికేశవులు నాయుడు మనుమరాలు చైతన్య పేరు ఖరారైనట్లు రెండు రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై తిరుపతికి చెందిన కూటమి నేతలు భగ్గుమంటున్నారు. చిత్తూరుకు చెందిన మహిళకు తిరుపతి తుడా చైర్మన్ కట్టబెడితే తమ పరిస్థితి ఏంటని? స్థానిక నాయకులు అమరావతికి వెళ్లి చంద్రబాబు, లోకేష్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలాగైతే తిరుపతిలో తలెత్తుకుతిరగలేమని తేల్చిచెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తుడా చైర్మన్ పదవికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. చైర్మన్ పదవి వచ్చిన వారికీ అదనంగా టీటీడీ ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా బాధ్యతలు అప్పగించడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే తుడా చైర్మన్ గిరికి అంత డిమాండ్ ఏర్పడింది. ఈ పదవిని తిరుపతి జిల్లాతో పాటు చిత్తూరు జిల్లాకు చెందిన కూటమి నేతలు కూడా ఆశిస్తుండడంతో పోటీ ఎక్కువైంది. తుడా చైర్మన్ పదవి దక్కిన వారిలో ఇప్పటి వరకు తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తికి చెందిన వారే ఉన్నారు. ఎందుకంటే.. ఈ నియోజకవర్గాల పరిధిలో తుడా విస్తరించి ఉండడమే ఇందుకు కారణం. అలా కాకుండా చిత్తూరుకు చెందిన వారికి కేటాయించనున్నారని తెలిసినప్పటి నుంచి తిరుపతి నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తుడా చైర్మన్ పదవి కోసం నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సూరా సుధాకర్‌రెడ్డి, మబ్బుదేవనారాయణరెడ్డి, సైకం జయచంద్రారెడ్డి, కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాసులు, డాలర్స్ దివాకర్‌రెడ్డి, పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ ఆశిస్తున్నారు. అలాగే బీజేపీ నుంచి శ్రీకాళహస్తికి చెందిన కోలా ఆనంద్, తిరుపతికి చెందిన భానుప్రకాష్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు.

చిత్తూరు వాసికి ఎలా ఇస్తారు?

తిరుపతి అసెంబ్లీ టికెట్ స్థానికులకు కాకుండా చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా పనిచేసిన ఆరణి శ్రీనివాసులకు కట్టబెట్టారు. అంతకుముందు టీటీడీ మాజీ చైర్మన్ ఆదికేశవులు నాయుడు మనుమరాలు చైతన్య కూడా తిరుపతి అసెంబ్లీ టికెట్ ఆశించిన విషయం తెలిసిందే. ఆరణికి తిరుపతి అసెంబ్లీ టికెట్ కేటాయించిన సమయంలోనే స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతిలో పోటీచేసే వారు లేరా? అంటూ అధినాయకులను నిలదీశారు కూడా. దీంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ నేరుగా జోక్యం చేసుకోవడంతో సమస్య సద్దుమణిగింది. ఆరణి శ్రీనివాసులు కోసం అందరూ కలిసి పనిచేశారు. ఎన్నికలు అయ్యాక తుడా చైర్మన్ తమకు వస్తుందని ఆశించిన వారికి షాకింగ్ న్యూస్ ప్రచారం కావడంతో తిరుపతికి చెందిన పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు నాయకులకు పదవులు ఇవ్వాల్సి వస్తే చుడా చైర్మన్ ఇస్తే తమకు అభ్యంతరం లేదని, తుడా ఇస్తే ఒప్పుకునేది లేదని తిరుపతికి చెందిన నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీ చేయాలని భావించి, అధిష్టానం ఆదేశాల మేరకు తమ నాయకులు త్యాగం చేశారని నరసింహయాదవ్, సుగుణమ్మ, కోలా ఆనంద్ అనుచరులు చెబుతున్నారు. అటువంటి వారికి కాకుండా చిత్తూరుకు చెందిన మహిళకు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే వదులుకున్నామని, తుడా చైర్మన్ పదవిని వదులుకునేందుకు సిద్ధంగా లేమని అధినాయకులకు తేల్చిచెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. త్యాగం చేసిన వారికి పదవులు ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో గంగమ్మ శిరస్సు ప్రాజెక్టు సాకారం



ఏపీ, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లోని గంగమ్మ శిరస్సు జలపాతం



నలగాంపల్లి వద్ద ఆగిన ప్రాజెక్టు పనులు(ఫైల్)

- విజయకుమార్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ

పలమనేరు: పలమనేరు మండలంలోని నలంగాంపల్లి వద్ద గంగమ్మ శిరస్సు పనులకు అటవీశాఖ అభ్యంతరాలు తొలిగాయని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని నీటిపారుదలశాఖ పర్యవేక్షక సాంకేతిక నిపుణులు పి. విజయకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన «శిరస్సు సాకారమయ్యేనా?» అనే కథనంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పలమనేరు పట్టణవాసులకు తాగు నీటిని అందించే క్రమంలో కాలువపల్లి వైఎస్సార్ జలాశయానికి నీటిని అందించేందుకు గంగమ్మ శిరస్సు ప్రాజెక్టును 2008లో ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ పనులను ప్రారంభించిందని తెలిపారు. ఆపై 2010లో వర్క్ కాంపొనెంట్ కోసం రూ.9.32 కోట్లు, భూసేకరణకు రూ.55 లక్షలను మంజూరు చేసిందన్నారు. అప్పట్లో ఈ పనులను బీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కొన్ని పనులు చేపట్టి భూసేకరణలో రైతుల అభ్యంతరాలతో పనులు ఆగాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 16.81 ఎకరాల సెటిల్‌మెంట్, 31.78 ఎకరాల డీకేటీ భూములను సేకరించామన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి చెన్నైలోని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సెంట్రల్) నుంచి అనుమతులు వచ్చాయని తెలిపారు. ఇలా ఉండగా 2022లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ.31.50 కోట్ల రివైజ్డ్ అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని పేర్కొన్నారు. ఆ మేరకు ఎరిగినేరు నుంచి 63.71 క్యూమెక్స్ వరదనీటిని కాలువపల్లి రిజర్వాయర్‌కు పంపడం, ఇందుకోసం 1.4 కి.మీ. డైవర్షన్ చానెల్, ఈ వంతెన తదితరాలతో ప్రతిపాదనలో పేర్కొన్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చిందని, ఫారెస్ట్ శాఖకు ల్యాండ్ బదిలీ ప్రక్రియకు జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపామని అందులో పేర్కొన్నారు. ఈ పనులు పూర్తవగానే ప్రాజెక్టు పనులు మొదలుకానున్నాయని తెలుస్తోంది. మొత్తం మీద ఈ ప్రాజెక్టు పూర్తయితే పలమనేరు ప్రాంత వాసుల తాగునీటి కష్టాలు శాశ్వతంగా తొలగినట్టే.

సాక్షి ఎఫెక్ట్..



రూ.4 కోట్ల విద్యుత్ బిల్లుల వసూలు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలను ఆదివారం కూడా అందుబాటులో ఉంచామని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాల్లో 8,500 మంది వినియోగదారులు బిల్లులు కట్టారన్నారు. తద్వారా రూ.4 కోట్లు వసూలైనట్లు తెలిపారు.

మినీ టెంపో చోరీ



చోరీకి గురైన టెంపో వాహనం

రామకుప్పం: మండలకేంద్రం రామకుప్పంలోని దిగువ వీధిలో ఆదివారం తెల్లవారుజామున మినీ టెంపోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుడు గురుప్రసాద్ రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఇంటి పక్కన ఆపి ఉంచిన మినీ టెంపో(అశోక్ లైల్యాండ్ దోస్త్) వాహనం (కెఏ07 7బీ1307)చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు చర్యలు ప్రారంభించారు. ఏదిఏమైనా ప్రశాంతంగా ఉన్న రామకుప్పంలో మినీ టెంపో వాహనం దొంగతనం జరగడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురవుతున్నారు. మినీ టెంపో వాహనం సమాచారం తెలిస్తే ప్రజలు రామకుప్పం పోలీసులకు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

పోలీసుశాఖలో 'మీ సేవలు మరువలేనివి'



పదవీ విరమణ చేసిన అధికారులు, వారి కుటుంబ సభ్యులతో ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసుశాఖలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులను చిత్తూరు ఎస్పీ మణికంఠ సన్మానించారు. ఆదివారం చిత్తూరు నగరంలోని పోలీసు అతిథిగృహంలో రిటైర్డు అయిన అధికారులకు సన్మానసభ నిర్వహించారు. చిత్తూరు వన్‌టౌన్ ఏఎస్ఐ మణి, కార్వేటినగరం ఏఎస్ఐ జయదేవ రెడ్డి, రామకుప్పం ఏఎస్ఐ మునియప్ప, తవణంపల్లె కానిస్టేబుల్ లోకయ్య, హోంగార్డులు పరిమళ, మురుగయ్యను ఎస్పీ అభినందించి సన్మానించారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు వృత్తిలో ఎన్నో ఒడిదుడుకులు, సమాజంలో మార్పులు చూస్తూ, పోలీసుశాఖకు సేవలందించడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో పోలీసు సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, సభ్యులు పరంధామ నాయుడు, వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఆర్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పపై శ్రీమన్నారాయణుడి వైభవం



కోదండరాముడికి ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు ఉదయం సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామికి అభిషేకం చేశారు. స్వామికి సుగంధపరిమళ పుష్పాలతో అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కైంకర్యాలకు మునివెంకటరెడ్డి, లోకనాథరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

భక్తిప్రపత్తులతో స్వామికి ఊంజల్‌సేవ

సాయంత్రం ఊంజల్‌సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు మంత్రాలు పఠనం చేస్తూ స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తగా శంకర్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

పుష్కరిణిలో శ్రీమన్నారాయణుడి విహారం

రాత్రి తెప్పోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఉత్సవమూర్తులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం చేయించారు. అనంతరం వేదపండితులు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలోని పుష్కరిణిలో విద్యుద్దీపాలంకరణ, సుగంధపరిమళ పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దిన తెప్పల్లో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామి కొలువుదీరి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. భక్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉభయకర్తలుగా యాగమూర్తి, గణపతినాయుడు, ఉదయ్‌కుమార్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, లోకనాతరెడ్డి, శంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి వ్యవహరించారు. ఆలయ ఆవరణలో చిత్తూరు శ్రీరంజని నృత్య కళాశాల విద్యార్థుల భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది.



ఆకట్టుకున్న శ్రీరంజని నృత్య కళాశాల విద్యార్థుల ప్రదర్శన



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

– భార్యతో గొడవపడి ఉరేసుకున్న వ్యక్తి

పెద్దపంజాణి: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని భద్రాచలం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పెద్దపంజాణి పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ మురళీరాజు కథనం మేరకు వివరాలు.. చౌడేపల్లి మండలం కోటూరు గ్రామానికి చెందిన రజాక్ సాబ్ కుమారుడు ఇమ్రాన్ (30) దాదాపు పదేళ్ల కిందట పెద్దపంజాణి మండలంలోని భద్రాచలం గ్రామంలో వివాహం చేసుకుని ఇక్కడే నివాసం ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల సంతానం. మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో భార్య మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఇమ్రాన్ జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం చెట్టుకు వేలాడుతున్న శవాన్ని గుర్తించిన మేకల కాపర్లు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గంగవరం రూరల్ సీఐ కృష్ణమోహన్ పరిశీలించారు

4 నుంచి ఏపీ ఈఏపీ సెట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ ఈఏపీ సెట్ ఎంపీసీ స్ట్రీమ్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కో–ఆర్డినేటర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 1నుంచి 7వ తేదీ లోపు ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అలాగే సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని సూచించారు. వీటిని హెల్ప్‌లైన్ సెంటర్లో పరిశీలిస్తామని తెలిపారు. 8నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని, 13న మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుందని వెల్లడించారు. 16న సీట్ అలాట్‌మెంట్, 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. స్పెషల్ కేటగిరీ (పీహెచ్, ఎన్‌సీసీ, క్యాప్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, ఆంగ్లో ఇండియన్స్, స్కాట్స్ అండ్ గైడ్స్) అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో ఈ నెల 6నుంచి 10వ తేదీలోపు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని సూచించారు. వివరాలకు ''ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపి.జీఓవి.ఇన్'' వెబ్‌సైట్‌ను సందర్శించాలని, ఏమైనా సమస్యలుంటే హెల్ప్‌లైన్ సెంటర్‌కు అభ్యర్థులు రావచ్చని కోరారు.

- జిల్లాలో 2,71,696 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు
- జూలై 3 వరకు మామిడికి గిట్టుబాటు ధర
- సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,71,696 మందికి గానూ రూ.181 కోట్ల సొమ్మును పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు. జిల్లాలో 11 కేటగిరీల పింఛన్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు. రూ.3 వేల నుంచి ప్రస్తుతం రూ.4 వేలు పింఛన్‌ను అందజేయనున్నట్లు చెప్పారు. పెరిగిన రూ.వెయ్యి చొప్పున గత మూడు నెలలకు రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు పింఛన్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. రెండో కేటగిరీలోని పాక్షిక దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలు, మూడో కేటగిరీలోని పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు, నాలుగో కేటగిరీలోని కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి రూ.5 వేల నుంచి రూ. 10వేలకుపెంచిన పింఛన్ అందించనున్నట్లు చెప్పారు.

జిల్లాలో కేటగిరీల వారీగా ఇలా..

జిల్లాలో కేటగిరీల వారీగా వృద్ధాప్య పింఛన్ 1,45,035 మందికి రూ.101.52 కోట్లు, నేతన్న పింఛన్ 2,572 మందికి రూ.1.80 కోట్లు, వితంతు పింఛన్ 59,993 మందికి రూ.42 కోట్లు, దివ్యాంగుల పింఛన్ 35,803 మందికి రూ.21.48 కోట్లు, అభయహస్తం పింఛన్లు 11,311 మందికి రూ.56.56 లక్షలు, కల్లుగీత కార్మికులు 561 మందికి రూ.39 లక్షలు, హిజ్రాలు 32 మందికి రూ.2.24 లక్షలు, ఒంటరి మహిళలకు 5,761 మందికి రూ.4.03 కోట్లు, మత్స్యకారులు 249 మందికి రూ.17.43 లక్షలు, డప్పు కళాకారులు 6,290 మందికి రూ.4.40 కోట్లు, చర్మకారులు 796 మందికి రూ.55.72 లక్షలు, కళాకారుల పింఛన్ 70 మందికి రూ.4.90 లక్షలు,సైనిక్ వెల్ఫేర్ పింఛన్ 61 మందికి రూ.3.05 లక్షలు, డీఎంహెచ్ఓ పరిధిలో 2,740 మందికి రూ.3.57 కోట్లు, సీకేడీయూ ప్రైవేట్ కింద 254 మందికి రూ.25.40 లక్షలు, సీకేడీయూ ప్రభుత్వం కింద 168 మందికి రూ.16.80 లక్షలు అందించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

ఉదయం 6 గంటల నుంచి పంపిణీ..

జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పింఛనుదారుల ఇంటి వద్దే పింఛను సొమ్మును పంపిణీ చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఒక్కో ఉద్యోగికి 50 గృహాల చొప్పున పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. సాధ్యమైనంత మేరకు ఒకేరోజు పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని, ఎవరైనా మిగిలిపోతే రెండోరోజు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు.

తోతాపురి రకం మామిడి కిలో రూ.24

జిల్లాలో జూలై 3వ తేదీ వరకు తోతాపురి మామిడి గిట్టుబాటు ధర కిలో రూ.24 అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో మామిడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులతో కలెక్టర్ మామిడి గిట్టుబాటు ధర అంశంపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూలై 3వ తేదీ వరకు రూ.24 గిట్టుబాటు ధరను అమలు చేసి ఆ తరువాత సమావేశం నిర్వహించి మరో ధర ను నిర్ణయిస్తామన్నారు. ప్రస్తుతం నిర్ణయించిన ధర బుధవారం వరకు అమల్లో ఉంటుందన్నారు. రైతులు మామిడిని నేరుగా పండ్ల పరిశ్రమల వద్దకు తీసుకెళ్లాలన్నారు. రైతులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం మామిడి రైతులు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో పండ్ల పరిశ్రమల నిర్వాహకులు గోవర్ధన్ బాబీ, రాఘవ, జైన్ షమీర్, రైతు సంఘ నాయకులు నాగేశ్వరరావు, వేణు, శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పాల్గొన్నారు.